తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినికథల పోటీలోరూ 100/- లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

గీతా, నేను స్నేహితులం. ఒకే కాలేజీలో చదువుతున్నా తరచు కలిసేది లేడీస్ క్లబ్‌లో. మా స్నేహంలోనే శతృత్వం కూడా వుంది. మాలో అవ్యక్తంగా పోటీలు జరుగు తుంటాయి. అవి ఆడవాళ్లకే అర్థమౌ తాయి!

ఉదాహరణకి, క్లబ్‌లో గీత నన్ను చూస్తూనే ఆప్యాయంగా "హాయ్, రాగిణీ ఏమిటే చిక్కినట్టున్నావ్? డైటింగా?" అంటుంది, నా సన్నని నడుముకేసి ఓర చూపులు చూస్తూ. నా అందాల వంపులు కేంద్రీకరించిన గరిమనాభి లాంటిది నా నడుము. సన్నని నా నడుము చూసి గీత గోలపెడుతూందని నాకు తెలుస్తుంది. మనసులో ఆనందిస్తాను. పైకి ఏమీ ఎరగనట్టు నవ్వేసి "అవునూ, నువ్వు మళ్లీ గేమ్సు ఆడుతున్నావా?" అంటాను ఆమె చేతిలో టి. టి. బ్యాట్ చూస్తూ. కానీ నేను నిజంగా చూసింది, ఆమె వేసుకున్న చు రీదార్, కుర్తా! ఎంత బాగుంది. గీతకు ఎంత బాగా నప్పింది! ఆమె డ్రస్ నా కళ్లలో కలర్ ప్రింట్ పడిపోతుంది. గీత ఎప్పుడూ ఏదో కొత్త ఫ్యాషన్‌లో కనిపిస్తూంటుంది. నేను నీరై పోతాను.

ఇద్దరం చెయ్యి, చెయ్యి పట్టుకు నడుస్తుంటాం. గీత, ఏదో మత్తుగా సువాసన తనని చుట్టుకుంటుంటే, కుతూహలంగా నాకేసి చూస్తూ "ఎంత గిలిగింతలు పెడుతోంది ఈ సువాసన! రాగిణీ నీ దగ్గరా?" అంటుంది. ఆడవాళ్లనే అంత మురిపిస్తే, యిక ఈ సెంటు యువకులను ఎంత పిచ్చెక్కిస్తుందో అని మురిసిపోతాను. పైకి మామూలుగా అంటాను. "ఆ మా అంకుల్ ఈ మధ్య స్టేట్స్ నుంచి వచ్చారులే. నాకీ ఫారెన్ పెర్‌ఫ్యూమ్ ప్రెజెంట్ చేశారు."

ఇద్దరం చెరో కుర్చీలో కూర్చుంటాం. "గీతా, నువ్వు ఊరెళ్లావటగా?" అడుగుతాను నేను, ఆమె లేందే కాలక్షేపం అవనట్టు. కాని నా 'బ్రెయిన్‌లో స్టెన్‌గన్‌లు'- ఆరుద్ర గారన్నట్టు. గీత నెయిల్స్ ఎంత చక్కగా మానిక్యూర్ చేయించుకుంది! గోళ్లకు ఆ ట్రాన్సపెరెంటు



# లేడీస్ టెన్ష్యం!

దేవరకొండ గంగాధర రామారావు

లైట్ పింక్ పాలిష్ ఎక్కడ సంపాదించింది? మన్మథుడి విల్లుల్లా, యౌవన రేఖల్లా కనుబొమలు ఎక్కడ తీర్చి దిద్దుకుంది? కవ్వింపుగా మెరిసే లిప్‌స్టిక్ అద్దుకున్న ఆమె పెదవులు ముద్దాడాలని ఏ మగాడు ఆరాటపడడూ? తన మేకప్ ప్రభావానికి నేను చిత్తయి పోయానని గీత గ్రహించుకునే, ఏమీ ఎరగనట్టు అంటుంది. "అవును. ఈ మధ్య బాంబే వెళ్లి వచ్చానులే. అక్కడ మా ఆంటీ నన్ను బ్యూటీ పార్లర్ కి లాక్కెళ్లింది......" అదీ రహస్యం! ఇలా స్టైలుగా తయారవడానికి గీతకు ఓ అయిదు వందలయినా వదిలుంటాయి. నాకు అదో కొంత సంతృప్తి. ఇలాగ బాణాలు విసురుకుంటూంటాం. అవి శరీరాలకు తగలవు. లోపల ఆవిరైపోతున్న అహానికి తగులుతాయి!

ఇంతలో క్లబ్ డే వచ్చింది. ఇదో పెద్ద ఫంక్షను. మాకు టెన్షన్! ఎవరి చేతిలో ఓడిపోతామోనని. క్లబ్‌లో వయసు మళ్లిన మెంబర్లు, ప్రత్యేక ఆకర్షణ కోల్పోయిన తమ శరీర భాగాలను విస్మరించి, వాళ్ల పోటీలు కేవలం ధన, కనక, వస్తు, వాహన, అధికార, ఆదాయ, వ్యయాల మీద జరుపుకుంటారు. యౌవన ప్రాదుర్భావంలో వున్న మేము యింకా అందం, ఆకర్షణ, ఒంపులూ, సొంపులూ మా నిశ్శబ్ద పోటీ అయిటములుగా భావిస్తాము.

ఈసారి నేను, లేటెస్ట్ మోడలు శారీ, ఇంత వరకు ఎవరూ కట్టనిది కట్టుకొచ్చి, గీతకు షాక్

## సోషలిజం

కష్టజీవి కళ్లకు
టెక్నీకలర్
అయిష్ట జీవికి మాత్రం
బ్లాక్ అండ్ వైట్

— జానీ

తినిపించాలని నిర్ణయించుకున్నాను. అదే ఆశతో బజారంతా తిరిగాను. 'ఫ్యాషన్స్', 'ఏమల్స్', 'కమల్స్'... అన్నీ గాలించాను. ఎక్కడా కొత్తవి లేవు. నిరుత్సాహ పడి చివరగా 'కుమార్స్' లోకి వెళ్లాను. ఇన్ని చీరెలు మడతలు విప్పి నా ముందు కుప్పలుగా పోశాడు. నా ముఖం వికసించలేదు. ఇది గమనించి మేనేజరు సేల్స్‌బోయ్‌తో ఏదో చెప్పాడు. వాడు లోపలకు వెళ్లి ఓ చీర తీసుకువచ్చాడు. "మేడమ్ ఇది చూడండి. ఫిల్మ్ స్టార్ సుహాసిని లేదూ ఆమెగారు మా చేత ప్రత్యేకంగా ఏరి కోరి ఈ డిజైన్ చీర బొంబాయి నుంచి తెప్పించుకున్నారు. ఆమెకు పంపుదామని ఫోన్ చేస్తే, ఆమె ఎక్కడో లొకేషన్ షూటింగ్‌కు పోయిందట. మీకు నచ్చితే తీసుకోండి" అన్నాడు. ఫిల్మ్‌స్టార్! అందులో నా ఫేవరిట్ యాక్ట్రెస్ సుహాసిని! ఇంకా సందేహమా. వెంటనే ప్యాక్ చేయించి, బిల్లు చెల్లించి బయటకు వచ్చాను. లేటెస్ట్ డిజైన్! నా కోరిక ఫలించింది.

మర్నాడు సాయంత్రం క్లబ్‌కి బయలు దేరాను. ఆ ఫిల్మ్‌స్టార్ శారీకి తగ్గ షోకులు చేసుకున్నాను. హైహీల్ షూస్ టిక్, టాక్ మనిపించుకుంటూ క్లబ్‌లో అడుగుపెట్టాను. చాలా రమణీయంగా వుంది. హొయలు ఒలకబోసుకుంటూ హాలులోకి వెళ్లే మెట్లెక్కాను. అక్కడ రిసెప్షన్ దగ్గర గీతా, రేఖా వున్నారు. గీత నా చేతికి గులాబి పువ్వు అందిస్తూ "వెల్‌కమ్" అంటూ నన్ను చూసి తెల్లమొఖం వేసింది. నేను "థాంక్యూ" అనబోయి గీతను చూసి మాట రాక ఆగిపోయాను. నాకు చెమటలు పట్టాయి. గీత రుమాలుతో బుగ్గలు అద్దుకుంది. శిలా ప్రతిమలా అయిపోయిన యిద్దరం కొద్ది క్షణాలకు తేరుకున్నాం.

"రాగిణీ నీ చీర...?" గీత నీరసంగా అడిగింది.

" 'కుమార్స్'లో... మరి నీది?" అన్నాను నేను భయంగా.

"కుమార్స్‌లోనే...... లేటెస్ట్ మోడల్!" గీత అనుమానంగా.

"బొంబాయి నుంచి ఫిల్మ్‌స్టార్ సుహాసిని తెప్పించుకుంది" నీ అనుమానం నిజమే అన్నట్టు నేను. "షూటింగ్‌కి వెళ్లిపోయింది......" గీత. ఇద్దరం మోసపోయామని తెలుసుకున్నాం. ఇద్దరిదీ ఒకే డిజైన్ చీర! ఇద్దరం ఫక్కున నవ్వేశాం. ఆ రోజునుంచి మాకు పోటీల్లేవు!! ●

బహుమతి పొందిన కార్టూన్

